కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం జిల్లా కన్వీనర్‌గా నర్సింగ్‌రావు


నియామక పత్రం అందుకుంటున్న నర్సింగ్‌రావు

కీసర: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా చీర్యాలకు చెందిన బక్కని నర్సింగ్‌రావును నియమించారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే రమేష్‌గుప్తా, మండల శాఖ అధ్యక్షుడు కె. కృష్ణాయాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మల్లేష్, చీర్యాల మాజీ సర్పంచ్ ధర్మేందర్, నాయకులు శ్రీనివాస్, సంతోష్, అంజి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన, కవితా పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇక్వల్ ఆక్సెస్ టూ ఎడ్యుకేషన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, కవితా పోటీ, చిత్రలేఖన పోటీ, ప్రకటన పోటీ, నాటకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్ సరోజా రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, సరిత, రాజేష్ పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

శామీర్‌పేట్: అనుమతి లేకుండా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి తవ్వి తవ్వకాలు జరిపిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు మంగళవారం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ మండలం, లాల్‌గడి మలక్‌పేటలోని కుడి చెరువులో రాత్రి సమయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు అందడంతో సోమవారం అర్ధరాత్రి చెరువు వద్దకు వెళ్లి చూడగా మట్టిని తరలిస్తున్న హిటాచి, టిప్పర్లు అక్కడే వదిలి పరారయ్యాయి. హిటాచి వాహనం తవ్వకాలు జరిపిన ప్రాంతంలో ఉందని, పోలీసులు వచ్చేసరికి పరారయ్యాని ఫిర్యాదులో ఇరిగే అసిస్టెంట్ అధికారి తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

జవహర్‌నగర్: వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై పోలీసులు దాడి చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ అంజనాద్రినగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఇద్రీస్ అలీ సిబ్బందితో కలిసి వ్యభిచార గృహంపై దాడి చేశారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఖాదర్ అలీముల్లా (26), రుబినా ఘాజి (23), రాజస్థాన్‌కు చెందిన నేమారామ్ అలియాస్ రాజు పటేల్ (35)ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వ్యభిచార నిర్వాహకులు రెహాన్‌ను కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత మహిళలను ప్రజ్వల హోమ్‌కు తరలించారు.

వ్యవసాయానికి ఆర్థిక సహాయం పెంచండి

జవహర్‌నగర్: వ్యవసాయానికి పెట్టుబడి సహాయం రూ.6 వేల నుంచి రూ.18 వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు, కార్యనిర్వాహక కార్యదర్శి నరేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రూ.2 లక్షల వరకు, పైన ఉన్న రుణమాఫీ రైతులకు పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని కోరారు. రైతు భరోసా సాగయ్యే భూములన్నింటికీ యుద్ధ ప్రాతిపాదికన ఇవ్వాలని, రాష్ట్ర స్థాయి పంటల భీమా పథకాన్ని ఏర్పాటుచేసి అమలు చేయాలన్నారు. వర్షాలు, వడగళ్లకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఏప్రిల్ 9న రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

‘చెత్త’శుద్ధి ఏదీ..?



పురపాలక సంఘాల్లో తడి, పొడి సేకరణలో నెరవేరని లక్ష్యం
- డివిజన్లు/వార్డులకు సమయానికి రాక రోడ్లపైనే పారబోత
- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్లు.. ఇబ్బందుల్లో ప్రజలు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉండగా, లక్షకుపైగా జనాభా కలిగిన పురపాలికలో రోజూ దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. పురపాలికల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాల్సిన ఉన్నా.. ఎక్కడా సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది. సంబంధిత అధికారులు మాత్రం చెత్త వాహనాలకు మైకులు పెట్టుకొని తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా..ఆచరణలో అమలు నోచుకోవటం లేదని తెలుస్తోంది.

సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలోని నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ నగర పాలక సంస్థలతోపాటు మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్, కొంపెల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్కేసర్, పోచారం మున్సిపాలిటీలు ఉండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఈ నగరాలు, పట్టణాల్లో చెత్తను తరలించే వాహనాలు వార్డులు/డివిజన్లకు సమయానికి రాకపోవడంతో పురపాలికల్లో పలుచోట్ల చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో తడి, పొడి చెత్త విభజన జరగడం లేదు. ప్రతి వార్డు/డివిజన్‌కు వాహనంతో పాటు సిబ్బందిని కేటాయించినా సేకరణ విషయంలో అలసత్వం వహిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తేనే స్పందన..

పురపాలికల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తడి, పొడి చెత్త సేకరణ అమలు కావడం లేదు. వార్డు అధికారులు చెత్త సేకరణను నిత్యం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికిని, సక్రమంగా చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించటం లేదని తెలుస్తోంది. కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త సేకరణ అమలుకు పునాది పడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవగాహన పరిచి తడి, పొడి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం..

పురపాలికల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదనే విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని సంబంధిత మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పట్టణాల్లో వార్డుల వారీగా పరిశీలించి తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. పట్టణ ప్రజలు కూడా ఎప్పటికప్పుడు చెత్త సేకరణలో జరుగుతున్న జాప్యాన్ని తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం


నవీన్ మిట్టల్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం


కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి వారి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతంకు చీర్యాల ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం వారిని కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఎంబీఏ, ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు



కీసర: రాంపల్లిలోని కేజీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని కళాశాల చైర్మన్ గోవిందరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాల్లో ఎంబీఏ, ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థుల కోసం యశోదా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల్లో విద్యార్థులకు చదువుతో పాటు ఉత్తమ ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు. యశోదా హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పి. రామారావు మానవ వనరుల అభివృద్ధి శాఖ హెడ్ హేమచందర్ బృందం ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, ఎంపిక అయిన విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.వి. రమణారావు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు సునీత, శిల్పికా పాల్గొన్నారు.

‘అబద్ధాలతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన’


మాట్లాడుతున్న మహేందర్ యాదవ్

జవహర్‌నగర్: బీసీ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు మాటలతో కాలం వెల్లదీస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్ అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో పాటు ముస్లింలకు 10శాతం కలిసి బీసీలను 52 శాతంగా చూపించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమని, కామారెడ్డి డిక్లరేషన్‌ను తుంగలో తొక్కి బీసీలతో ఆటలాడటం దుర్మార్గమన్నారు. బీసీలకు ఏడాదికి 20 వేల కోట్లు కేటాయిస్తామని దొంగమాటలతో అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా బీసీలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జవహర్‌నగర్ కార్పొరేషన్ అధ్యక్షులు కమల్, జోగారావు, నాయకులు పుణ్యరాజు, లిఖితయాదవ్, బాబు, యాదగిరి యావ్, శ్రవణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 10వ వార్డులో సీసీ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభించారు. వర్షాలతో రోడ్డుపై నీరు నిలవడంతో బురదగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న స్థానికుల విన్నపంతో గత పాలకవర్గం నిధులు కేటాయించింది. ఈ కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ పావనీయాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, నాయకులు శశిధర్, నరసింహాచారి, దయానంద్, నర్సింగ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

‘సన్నబియ్యం పంపిణీతో పేదలు సంతోషంగా ఉన్నారు’

కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్నబియ్యం పంపిణీతో పేదలు సంతోషంగా ఉన్నారని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో సన్నబియ్యం లబ్ధిదారులు రాగుల లక్ష్మి, గడ్డం కళమ్మ, వంగపల్లి మమత, ఆరుట్ల స్వాతి ఇంటి వద్ద సన్నబియ్యంతో ఏర్పాటు చేసిన భోజనాన్ని కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన తిన్నారు. అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీపై లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బండారి మల్లేష్ యాదవ్, గూడురు అశోక్‌గౌడ్, పంగముత్యాలు, పంగహరిబాబు, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, కొండల్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు,

పెండింగ్‌లో ఉన్న చేయూత పింఛన్లపై శ్రద్ధ చూపాలి



సాక్షి,సిటీబ్యూరో: చేయూత పింఛన్లలో మరణించి కేసులను అప్‌డేట్ చేసి స్పౌజ్‌కు పింఛన్ అందించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తా మాట్లాడుతూ..జిల్లాలో మండలాల వారీగా కొన్ని నెలలుగా పంపిణీ కాకుండా బ్యాంకులలో, పోస్టాఫీసుల్లో పెండింగ్‌లో ఉన్న చేయూత పింఛన్లను పరిశీలించి అప్‌డేట్ చేయాలని సూచించారు. పింఛన్‌దారుని ఖాతాలోకి జమ కాకుండా పెండింగ్‌లో ఉండడానికి కారణలైన మరణ/వలస/ఆధార్ అప్‌డేట్ కేసులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని మండలాల్లో ఎక్కువగా ఉన్న పెండింగ్‌లో ఉన్న కేసులపై మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి క్లియర్ చేయాలన్నారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన అప్లికేషన్లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి అవసరమై మేరకు టాయిలెట్లు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను కల్పించాలని అదనపు కలెక్టరు ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌కు వాటర్ ఫిల్టర్లను పంపిణీ చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు తమ వద్ద ఉన్న జనరల్ ఫండ్ నుంచి ఎన్యూమరేటర్లుగా విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు ఇవ్వాలని ఆదేశించారు. మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల వివరాలను పరిశీలించి, పునఃపరిశీలన చేయాలని కోరారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా కుట్టిస్తున్న విద్యార్థుల యూనిఫాంలను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత గడువులోగా యూనిఫాంలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, హౌజింగ్ ఈఈ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

చెత్తను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు


మేడ్చల్ పెద్ద చెరువు అలుగుల వద్ద చెత్తను తొలగిస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా బీజేపీ చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మేడ్చల్‌లో బీజేపీ నాయకులు మంగళవారం మేడ్చల్ పెద్ద చెరువు ఒడ్డున ఉన్న చెత్తను తొలగించారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రం చేసి పెద్ద చెరువు వరకు ర్యాలీగా వెళ్లి చెరువు అలుగుల వద్ద ఉన్న చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చెరువు శుభ్రతను, పరిసరాల శుభ్రతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకులు శైలజ, ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రావు, ప్రేందాస్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో..

మండల బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని డబీల్‌పూర్, రావల్‌కోల్ తదితర గ్రామాల్లో మండల బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల్ మహేంద్రహిల్స్ మహిళా డిగ్రీ కళాశాలలో యూపీపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శారద తెలిపారు. జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, గణిత ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్స్, జనరల్ సైన్స్ బోధించడానికి సివిల్స్ మెయిన్ పరీక్షలకు క్వాలిఫై అయిన పురుష అభ్యర్థులు అర్హులన్నారు. 40 ఏళ్ల నిండి అనుభవం గల వారు వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 12లోపు తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల వెబ్‌కు దరఖాస్తులు పంపాలని, ఇతర వివరాలకు 90105 19559లో సంప్రదించాలన్నారు.


అక్రమ నిర్మాణం కూల్చివేత

పోచారం: చౌదరిగూడలోని ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు డీ.ఎస్.రజిని మాట్లాడుతూ..ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూల్చివేత పనులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కావ్య పర్యవేక్షించారు.

ఆర్టీసీ బస్సులో పుస్తెల తాడు చోరీకి యత్నం

శామీర్‌పేట్: ఆర్టీసీ బస్సులో వృద్ధురాలి మెడలోంచి బంగారు పుస్తెల తాడును అపహరించేందుకు యత్నించిన మహిళకు తోటి ప్రయాణికులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత వృద్ధురాలు తెలిపిన వివరాల ప్రకారం..మూడుచింతలపల్లి మండలం, నాగిశెట్టిపల్లికి చెందిన దాసరి పార్వతి (65), తన గ్రామానికి వచ్చేందుకు నగరంలోని లాల్‌బజార్ వద్ద సికింద్రాబాద్–కాశిరెడ్డిపల్లి 568 సర్వీసు బస్సు ఎక్కింది. ఆమెను అనుసరిస్తూ మరో మహిళ కూడా అదే బస్సు ఎక్కి, బస్సు రద్దీగా ఉండటంతో వృద్ధురాలి మెడలో ఉన్న 4 తులాల పుస్తెలతాడును అపహరించింది. అనంతరం తూంకుంట మున్సిపాలిటీలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ వద్దకు రాగానే తనకు ఆరోగ్యం సహకరించడం లేదని నిందితురాలు బస్సు దిగి సమీప పొదల్లోకి పారిపోయింది. బస్సులో ప్రయానిస్తున్న మహిళలతో పాటు బస్సు డ్రైవర్‌కు అనుమానం రావడంతో వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు చోరీ అయినట్లు గుర్తించారు. దీంతో బస్సు డ్రైవర్, ప్రయాణికులు కలిసి పొదల్లోకి పారిపోయిన మహిళను తీసుకువచ్చి తనిఖీ చేయగా పుస్తెలతాడు లభ్యమైంది. ప్రయాణికులు ఆమెను శామీర్‌పేట పోలీసులకు అప్పగించారు. కాగా పట్టుబడిన మహిళపై 1991 సంవత్సరం నుంచి పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు సమాచారం.

గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి


సుమంత్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలకు చెందిన విద్యార్థి గుండెపోటుతో మృత్యు ఒడికి చేరాడు. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన సుమంత్ సీఎంఆర్ సెట్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ కోర్సు తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కళాశాలలో ఉన్న సమయంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కిందపడిపోయాడు. దీంతో సమీపంలో ఉన్న సీఎంఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్య పరీక్షలు చేసిన వైద్యులు మాములు నొప్పి అని చెప్పి కొంతసేపటికి విద్యార్థిని ఇంటికి పంపించారు. సాయంత్రం మరోమారు విద్యార్థికి నొప్పి రావడంతో కుటుంబీకులు గుండెపోటుకు గురైనట్లు గుర్తించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కాగా సీఎంఆర్ ఆస్పత్రిలో వైద్యులు నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే విద్యార్థి సుమంత్ మృతి చెందాడని తోటి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

కల్యాణం..కమనీయం



సాక్షి, సిటీబ్యూరో: కొంపల్లిలోని ఆంథమ్ విస్టాస్ గేటెడ్ కమ్యూనిటీలో సీతారాముల కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. కమ్యూనిటీలోని క్లబ్‌హౌస్‌లో జరిగిన ఈ వేడుకలో ఆంథమ్ విస్టాస్ ప్రెసిడెంట్ కే.శ్రీనివాసరావుతో పాటు కమ్యూనిటీలోని దంపతులు, భక్తులు ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. సీతారాముల కల్యాణం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. తెలుగు, హిందీలో భక్తి సంగీత భజనలు, పాటలతో పాటు కూనల్ కపాడియా మ్యూజికల్ ఈవెంట్స్ వీక్షకులు, చిన్నారులు మంత్రముగ్ధులయ్యారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి


జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్‌లో పీబీ సూర్యానగర్, నెహ్రూనగర్, సంతోషిమానగర్, ఆఫీసర్స్ కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి జీఎం సునీల్‌కు కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ఫిబ్రవరి నెలలో ఎండీ అశోక్‌ను కలిసి డివిజన్‌లోని భూగర్భ డ్రైనేజీ పనుల వివరాలను తెలిపామని చెప్పారు. జాన్సీరేఖ, సుజాత, శిరీష, రమణ తదితరులున్నారు.

ఆర్థికసాయం..

గౌతంనగర్: డివిజన్ ఇందిరానెహ్రూనగర్‌లో నివసించే రాజు, బాలమణిల ఇళ్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో ఇంట్లో ఉండే నిత్యావసర సరుకులు, ఎలక్ట్రికల్ పరికరాలు బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించి బాధితురాలు బాలమణిని పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు మేకల రాముయాదవ్ తదితరులున్నారు.

వృద్ధురాలి అదృశ్యం


నర్సమ్మ

పోచారం: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం..నారాయణ్‌పేట్ జిల్లాకు చెందిన ఉట్కూర్ నర్సమ్మ (50) కుమార్తె, అల్లుడితో కలిసి కొర్రెముల్‌లో ఉంటోంది. మూడేళ్ల కింద ఆమెకు పక్షవాతం రావడంతో కర్ర సాయంతో నడుస్తోంది. స్వగ్రామం వెళ్లాలనిపిస్తోందని ఇంట్లో వారికి ఆమె చెప్పడంతో సెలవు రోజుల్లో తీసుకెళ్తామన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరికీ తెలియకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఆమె అల్లుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.